గోవిందరావుపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భూపాలపల్లి రెడ్డికాలనీలో బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే జీఎస్ఆర్

వెంకటాపూర్ : రామప్పలో ..

వెంకటాపురం(నూగూరు) : బతుకమ్మ ఆడుతున్న ఆడబిడ్డలు

ములుగు జిల్లా కేంద్రంలోని తోపుకుంట వద్ద బతుకమ్మ సంబురాల్లో మహిళలు

ములుగు జిల్లా కేంద్రంలోని తోపుకుంట వద్ద బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న యువతి

ములుగులో బతుకమ్మను ఎత్తుకున్న యువతి

చిట్యాల : కైలాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..

భూపాలపల్లి రెడ్డి కాలనీలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

సద్దికట్టి సాగనంపి..

- అంగరంగ వైభవంగా సద్దులు
- ముగిసిన బతుకమ్మ వేడుకలు
- కిటకిటలాడిన చెరువులు, మైదానాలు
- ఆడిపాడిన మహిళలు, యువతులు
- గుబాళించిన తెలంగాణ సంస్కృతీ సంప్రదాయం
- పోలీసుల భారీ బందోబస్తు
- పలు మండలాల్లో కురిసిన వర్షం
- ఇబ్బందులు పడిన ఆడబిడ్డలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పూలజాతర అట్టహాసంగా ముగిసింది. సద్దుల బతుకమ్మను గురువారం ఘనంగా జరుపుకున్నారు. సంబురాల్లో చిన్న,పెద్ద భాగస్వాములయ్యారు. గడపకో బతుకమ్మ బయల్దేరి ఊరూవాడా సందడి చేసింది. వేలాదిగా మహిళలు తరలివచ్చి ఆడిపాడారు. తొమ్మిదిరోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో 'పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా..' అంటూ ఆడపడుచులు గంగమ్మ చెంతకు గౌరమ్మను సాగనంపారు. వెంట తెచ్చుకున్న సద్దులను వాయినంగా ఇచ్చి పుచ్చుకున్నారు. పలు మండలాల్లో అకస్మాత్తుగా వర్షం కురువడంతో ఆడబిడ్డలు నిరుత్సాహానికి గురయ్యారు. గణపురం మండలం బుద్దారం, భూపాలపల్లి పట్టణంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళా పోలీసులను మఫ్టీలో ఉంచి ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు.

వాయినం ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు

సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం

ములుగురూరల్ : సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా గురువారం తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో జడ్పీ కార్యాలయ ఆవరణలో కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. 250మంది కళాకారులు జాతీయ రహదారి మీదుగా తోపుకుంట వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో రహీమొద్దీన్, పంచాయతీ కార్యదర్శి పెంట రఘు పాల్గొన్నారు.

గణపురం మండల కేంద్రంలో బతుకమ్మలతో మహిళలు

మంగపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భూపాలపల్లిలో యువతి

ఏటూరునాగారం : బొడ్రాయి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రేగొండ : కోటంచ ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

టేకుమట్ల : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కళాకారులతో ములుగు అదనపు కలెక్టర్, అధికారులు

వాజేడు : ప్రగళ్లపల్లిలో..

భూపాలపల్లి కృష్ణ కాలనీలో..

గోవిందరావుపేట : చల్వాయిలో..

ములుగు జిల్లా కేంద్రంలోని తోపుకుంట వద్ద మహిళలు..

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

సింగరేణి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 10 : సింగరేణి సంస్థలో యువ శక్తి పెరుగుతున్నదని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో సంస్థలో నూతనంగా చేరిన ఆరుగురికి జీఎం ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేయాలని వారికి సూచించారు. అలాగే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఫ్యామిలీ డే కార్యక్రమం నిర్వహించగా జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్, సేవ అధ్యక్షురాలు జమాబేగం హాజరయ్యారు. ఉద్యోగుల మహిళలకు, మహిళా ఉద్యోగులకు, స్థానిక ప్రజలకు ఆటలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ వోటు జీఎం కవీంద్ర, భూపాలపల్లి ఏరియా సీఎంవోఏఐ అధ్యక్షుడు టీ వెంకట రామరెడ్డి, అధికార ప్రతినిధి మారుతీ రావు, కేటీకే-1 ఏజెంట్ రమణ, యూనియన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలి : ఎస్పీ

మహాముత్తారం, అక్టోబర్ 10 : మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. గురువారం ఆయన అడవి ముత్తారం పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది పని తీరు తెలుసుకుని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల స్థితిగతులు, స్టేషన్ పరిధిలో నేరాలు జరిగే ప్రాంతాలపై ఎస్సై మహేంద్రకుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్‌కు గిరిజన క్రీడాకారులు

కాటారం, అక్టోబర్ 10 : 53వ సీనియర్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కాటారం గిరిజన గురుకులం ఆశ్రమ కళాశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. గత నెల 30న కరీంనగర్ జిల్లాలో జరిగిన సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి వరంగల్ జిల్లా జట్టు తరపున టీ జితేందర్, బీ వంశీ, బీ చందర్, కోచ్‌గా వెంకటేశ్ అర్హత సాధించారు. రంగారెడ్డి జిల్లాలోని తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నామిలికొండ ప్రభాకర్ తెలిపారు. క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్ బీ లాలు, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేశ్ అభినందించారు.

కుక్కల దాడిలో 9 మందికి తీవ్ర గాయాలు

గణపురం, అక్టోబర్ 10 : వీధి కుక్కల దాడిలో గురువారం తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గణపురానికి చెందిన దామ నాగరాజు, కిశోర్, రావుల అనిల్, మాదాసు అర్జున్, వడ్డేపల్లి సూర్యతేజ, గోగిరి అనిల్‌తోపాటు మరో ముగ్గురిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. నలుగురికి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వారిని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపనను విజయవంతం చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గణపురం, అక్టోబర్ 10: మండలంలోని మైలారం వద్ద శుక్రవారం జరుగనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభోత్సవ పనులను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. శుక్రవారం ఉదయం10 గంటలకు మొదటి దశలో చేపట్టనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ హాజరు కానున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆర్ఐ రహమత్ భాషా ఉన్నారు.

కానిస్టేబుల్ టు టీచర్

కాటారం, అక్టోబర్ 10 : కాటారం పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన గడిపెల్లి తేజశ్రీ డీఎస్పీలో జగిత్యాల జిల్లా నుంచి ఎస్‌జీటీలో 65వ ర్యాంకు సంపాదించింది. తేజశ్రీ తల్లిదండ్రులు గడిపెల్లి లక్ష్మి, వెంకటేశం మాట్లాడుతూ తమ కూతురు పోలీస్ కొలువు నుంచి ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కాగా, తేజశ్రీని తోటి పోలీస్ సిబ్బంది, అధికారులు అభినందించారు.

నీట్ స్టేట్ ర్యాంకర్‌కు బీఆర్ఎస్ సన్మానం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 10 : నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన పిడుగు శ్రీదేవి, మారుతీరావు దంపతుల కూతురు నిహారిక 639 మార్కులతో స్టేట్ 432 ర్యాంకు సాధించి హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్ ముంజాల మురళీధర్, బీఆర్ఎస్ నాయకులు మాడ హరీశ్‌రెడ్డి, సెగ్గం సిద్ధు, ఆకుదారి రాజమల్లు, పూసల యుగేంద్రాచారి, జోరు రాజ్‌కుమార్ నిహారికను శాలువాతో ఘనంగా సన్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

రాష్ట్ర పురోగతిని తెలిపేది తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం పుస్తకం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 10 : రాష్ట్రం ఎలా పురోగమిస్తున్నదో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం-2024 పుస్తకం తెలియజేస్తుందని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం పుస్తకంలో పొందుపర్చినట్లు చెప్పారు. వ్యవసాయం, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఫార్మాస్యూటికల్స్‌తో సహా వివిధ రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితి, రాష్ట్ర వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి, ఉపాధి అవకాశాలను తెలియజేస్తూ ప్రణాళికా శాఖ ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పుస్తక రూపకల్పనలో భాగస్వాములైన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి బాబూరావు, గణాంక అధికారి బీ జవహర్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వికటించిన వైద్యంపై విచారణ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

తాడ్వాయి, అక్టోబర్ 10 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం జంపంగవాయి గ్రామంలో ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ డైరెక్టర్ స్పందించారు. ఊరట్టం పోస్టాఫీస్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (ఏబీపీఎం)గా విధులు నిర్వర్తిస్తున్న జంపంగవాయి గ్రామానికి చెందిన కుర్రి రత్నకుమారి విష జ్వరంతో ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతూ ఈ నెల 6న రాత్రి మృతి చెందింది. ఈ విషయమై ఈ నెల 8న 'నమస్తే తెలంగాణ'లో 'ఆర్ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి' శీర్షికన ప్రచురితమైంది. దీనికి స్పందించిన హెల్త్ డైరెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్యను ఆదేశించారు. దీంతో ఆయన తాడ్వాయి మండలంలో పని చేస్తున్న వైద్యాధికారులు సీహెచ్ శ్రీకాంత్, కే రణధీర్ విచారణ జరిపించి మృతికి గల కారణాలను వైద్య ఆరోగ్య శాఖకు నివేదించారు. దీనిని పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు హెల్త్ డైరెక్టర్ తెలిపారు.

జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన అభ్యర్థులు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 10 : జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 196 మంది జాయినింగ్ రిపోర్టును గురువారం అందించినటట్లు డీఈవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 212 మందికిగాను 196మంది జాయినింగ్ రిపోర్టు ఇచ్చారన్నారు. ఇంకా 16మంది రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ శనిగరపు భద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ గౌసుద్దీన్, కృష్ణమోహన్, ఉపాధ్యాయులు రామయ్య రిపోర్టులను తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మానసిక సమస్యలను గుర్తించాలి

ములుగురూరల్, అక్టోబర్ 10 : ఆధునిక ప్రపంచంలో మానసిక ఆరోగ్య సమస్యలు రోజు రోజుకూ ఎక్కువ అవుతున్నాయని, వాటిని మొదటి దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. గురువారం ప్రభుత్వ దవాఖానలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి అప్పయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక రోగులు ముభావంగా ఉండటం, అతిగా నిద్ర పోవడం, మత్తు పదార్థాలకు బానిస కావడం, అనుకోకుండా కోపాన్ని ప్రదర్శించడం అలాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందేలా తగిన చికిత్స పొందాలని అన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ నమ్రత, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

రతన్ టాటాకు ఘన నివాళి

ఏటూరునాగారం, అక్టోబర్ 10 : వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతిపై ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు వై జంక్షన్‌లో ఆయన చిత్ర పటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణ ప్రసాద్, ఆదివాసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటి రవి, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన కోటయ్య, నాయకులు చందా మహేశ్, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ కేసులో ఒకరి రిమాండ్

చిట్యాల (మొగుళ్లపల్లి), అక్టోబర్ 10 : ట్రాక్టర్ ట్రాలీ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గణేశ్‌పల్లికి చెందిన రైతు వల్లాల రాజునారాయణ పెద్దకోమటిపల్లి శివారులోని వ్యవసాయ భూమివద్ద ట్రాక్టర్ ట్రాలీని ఉంచగా చోరీకి గురైంది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలకేంద్రం శివారులో గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్రువపత్రాలు లేని ట్రాక్టర్, ట్రాలీని గుర్తించి అనుమానిత వ్యక్తిని విచారించగా బద్దంపల్లి గ్రామానికి చెందిన యాళ్ల చిరంజీవిరెడ్డి నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. అతడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ సారంగపాణి, హోంగార్డు రవిని సీఐ మల్లేశ్‌యాదవ్ రివార్డు అందజేసి అభినందించారు.

కలెక్టర్‌కు 'రావణవధ'కు ఆహ్వానం

ములుగురూరల్, అక్టోబర్ 10 : రావణ వధ ఉత్సవ కమిటీ బృందం సభ్యులు గురువారం కలెక్టర్ టీఎస్ దివాకరను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి పర్వదినం రోజున నిర్వహించే రావణవధ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రికను కలెక్టర్‌కు అందించారు. అదేవిధంగా ఎస్పీ డాక్టర్ శబరీష్, డీఎస్పీ రవీందర్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్ భాస్కర్‌లకు సైతం ఆహ్వాన పత్రికను అందజేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎల్కతుర్తి శ్రీహరి, చల్లూరి మహేందర్, గంగె రాజు, గుగ్లిళ్ల సుజన్‌కుమార్, అనుముల సురేశ్, మాదరి జనార్దన్ ఉన్నారు.

దివ్యాంగుడికి వీల్ చైర్ అందజేత

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 10 : మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మహాలక్ష్మి వీధికి చెందిన మడకం శ్రీను అనే దివ్యాంగుడికి సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతిరావు గురువారం వీల్ చైర్ అందించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వీల్ చైర్ అందించడం అభినందనీయమని తెలిపారు. పీఎస్సై ఆంజనేయులు, సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక తీజ్ : ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 10 : తీజ్ ఉత్సవాలు లంబాడాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం సాయంత్రం భూపాలపల్లి మండలం కమలాపూర్, గొల్లబుద్దారం గ్రామాల్లో నిర్వహించిన తీజ్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. లంబాడాలంతా ఏకతాటిపైకి వచ్చి ఉత్సవాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తులు

కాటారం, అక్టోబర్ 10 : ఇటీవల స్టాఫ్ సెలక్షన్ కమిషన్ జారీ చేసిన 39,481 ఖాళీల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేయనున్నట్లు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అక్టోబర్ 14 వరకు చివరి గడువు ఉందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 జనవరి-ఫిబ్రవరి మధ్యలో ఆన్‌లైన్ ద్వారా రాత పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, ఒక ఫొటో, పదో తరగతి మెమోతో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తున్నట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి

కాళేశ్వరం, అక్టోబర్ 10 : మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో పసుల మల్లయ్య(50) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గోదావరిలో చేపలు పట్టేందుకు బుధవారం మల్లయ్య వెళ్లి తిరిగి రాకపోవడంతో గురువారం గోదావరి తీర ప్రాంతంలో వెతుకగా మృతదేహం కనిపించింది. ఘటనా స్థలానికి కాళేశ్వరం ఎస్సై చక్రపాణి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములుగురూరల్, అక్టోబర్ 10 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఏడు గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మంకిడి రాజబాబు తన ద్విచక్రవాహనంపై ములుగు నుంచి డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వైపు రాంగ్ రూట్‌లో తన ఇంటి వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఆర్టీవో కార్యాలయం వైపు నుంచి ములుగు వైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు అంతర్రాష్ట్ర కార్మికులు వస్తుండగా డీఎల్ఆర్ వద్దకు చేరుకోగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజబాబుతోపాటు ఒక అంతర్రాష్ట్ర కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరిని ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.